

పేదోడి గూడు..

పేదోడి గూడులో సమస్యల గోడు వినిపిస్తుంది. గృహకల్ప ఇళ్లకు తాగునీరు అందక ఇబ్బంది పడుతున్నారు. 10లో▸



రోబో స్ప్రేయర్‌తో పిచికారీ

గ్రామాల్లో ఏటా పత్తి పంటను అధికంగా సాగు చేస్తున్నారు. గతేడాది మంచి లాభాలు గడించారు. 10లో▸



హిందుత్వంపై కుట్ర

కమ్యూనిస్టులు భారతదేశంలో హిందూ ధర్మాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని రమేశ్‌ ఆరోపించారు. 10లో▸

న్యూస్‌రీల్‌

నిరుద్యోగులపై ప్రభుత్వం నిర్లక్ష్యం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి
- కలెక్టర్‌ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్‌: ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం నిరుద్యోగులకు జాబ్‌ క్యాలెండర్‌ అమలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి డిమాండ్‌ చేశారు. బీజేవైఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం కొంగరకలాన్‌లోని కలెక్టర్‌ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్‌ శశాంకకు వినతిపత్రం అందజేశారు. ధర్నాకు హాజరైన నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ఎన్నికల హామీ మేరకు వెంటనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. నిరుద్యోగుల సమస్యలపై కాంగ్రెస్‌ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని ఆరోపించారు. 25వేల పోస్టులతో కూడిన మెగా డీఎస్సీ వేయాలని డిమాండ్‌ చేశారు. గ్రూప్‌–2, 3 పోస్టులు పెంచి మరో నోటిఫికేషన్‌ విడుదల చేయాలన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగ నియామకాల్లోనూ ఎన్నో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోసుపల్లి ప్రతాప్‌, లచ్చిరెడ్డి, దయానంద్‌గౌడ్‌, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి ప్యాట అశోక్‌ , లీగల్‌ సెల్‌ కన్వీనర్‌ పగడాల శ్రీశైలం, దిలీప్‌గౌడ్‌, పాండు, యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.

‘హైడ్రా’ ఏర్పాటు ఏకపక్షం

సాక్షి, సిటీబ్యూరో: ఈవీడీఎం పేరిట ప్రత్యేక డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేస్తూ జీహెచ్‌ఎంసీ పరిధిలోకి తేవడం, దాన్ని ఇటీవల ఏర్పాటు చేసిన ‘ హైడ్రా’లో విలీనం చేయడం చట్ట విరుద్ధం, ఏకపక్షమని ఎంఐఎం పార్టీకి చెందిన ఏడుగురు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్‌ కమిటీ సభ్యులు ఆరోపించారు. చట్టం మేరకు వాటిపై తగిన నిర్ణయం తీసుకోవాలని వారు మేయర్‌ గద్వాల్‌ విజయలక్ష్మిని కోరారు. ఈ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ఈవీడీఎం, హైడ్రాల ఏర్పాటుకు సంబంధించిన జీవోలు వెనక్కు తీసుకునేలా చూడాలన్నారు. ఈ మేరకు వారు మేయర్‌కు , కమిషనర్‌ ఆమ్రపాలికి వినతిపత్రాలు అందజేశారు. హైడ్రా పేరిట ప్రత్యేక సంస్థ ఏర్పాటు ఓఆర్‌ఆర్‌ పరిధి లోని జీహెచ్‌ఎంసీ, ఇతర స్థానిక సంస్థల అధికారాలు, హక్కులు, విధులను గుంజుకోవడమేనని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం పునరాలోచించి తగిన నిర్ణయం తీసుకునేలా చూడాలని వినతిపత్రంలో కోరారు. ఈ అంశంపై జీహెచ్‌ఎంసీ స్టాండింగ్‌కమి టీ సమావేశంలో తీర్మానం చేయాలని, చర్చించేందుకు పాలకమండలి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

‘కుదిరితే’ ఆమోదం.. లేదంటే తిరస్కరణ!

‘ధరణి’ పోర్టల్‌ చుట్టూ దగాకోరులు

- మూకుమ్మడిగా రిజెక్ట్‌ చేస్తున్న తహసీల్దార్లు
- తలపట్టుకుంటున్న బాధితులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా గత ప్రభుత్వం తీసుకొచ్చిన ‘ధరణి’ పోర్టల్‌ రెవెన్యూ అధికారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియలో దొర్లిన తప్పులను సరిచేసేందుకు కొంత మంది అధికారులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. పహాణీలతో పాటు పాత పట్టాదారు పుస్తకాలు, పొజిషన్‌లో ఉన్న ఆనవాళ్లకు సంబంధించిన అన్ని ఆధారాలను దరఖాస్తుకు జత చేసినా పట్టించుకోవడం లేదు. నెలలు గడుస్తున్నా క్షేత్రస్థాయి అధికారులు నివేదికలు పంపడం లేదు. ఒక వేళ పంపినా వాటిని ధ్రువీకరించడమో లేక తిరస్కరించడమో చేయకుండా జాప్యం చేస్తున్నారు. విసిగిన బాధితులు నేరుగా ఆయా అధికారుల కార్యాలయాలకు చేరుకుని కలిస్తే.. ఏదో ఒక సాకు చూపి తిరస్కరిస్తున్నారు. వారు ఆశించినంత ఇచ్చేందుకు అంగీకరించిన వారి ఫైళ్లుక్లియర్‌ చేస్తున్నారు. నిరాకరించిన వారివి తిరస్కరిస్తున్నారు. క్షేత్రస్థాయి ఆర్‌ఐలు మొదలు ధరణి ఆపరేటర్లు, తహసీల్దార్లు, కలెక్టర్ల వరకు ఎవరి స్థాయిలో వారు ఆయా భూముల విలువను బట్టి.. ఒక్కో ఫైలుకు ఒక్కో ధర నిర్ణయిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే ఇక్కడ పని చేసిన ముగ్గురు కలెక్టర్లు సైతం ఇదే అంశంపై తీవ్రస్థాయి



ఆరోపణలు ఎదుర్కొన్న విషయం విదితమే.

తలపట్టుకుంటున్న తహసీల్దార్లు

మొత్తం 36,463 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా వీటిలో 30,026 తహసీల్దార్ల వద్ద, 5,024 ఆర్డీఓల వద్ద, 1,038 అదనపు కలెక్టర్‌ వద్ద, 375 కలెక్టర్‌ లాగిన్‌లో ఉన్నాయి. వీటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ప్రభుత్వంలోని పెద్దల నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా సీసీఎల్‌ఏ కమిషనర్‌ తరచూ రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆ మేరకు కలెక్టర్‌ సైతం తహసీల్దార్లతో సమావేశాలు నిర్వహించి, ఆదేశాలు జారీ చేస్తున్నారు. వీటిని పరిశీలించినట్లు చూపేందుకే రిజెక్టు చేస్తున్నట్లు సమాచారం. బాధితులు తమ అర్జీని ఎందుకు తిరస్కరించారని నిలదీస్తే సమాధానం చెప్పలేక తహసీల్దార్లు ఇబ్బంది పడుతున్నారు.

జూలై చివరి వరకు పెండింగ్‌ దరఖాస్తుల వివరాలు

దరఖాస్తు రకం	అందిన వినతులు
ఎస్‌ఆర్‌ఐ పీపీబీ	87
కోర్టు కేసు ఇంటిమేషన్స్‌	3,576
కోర్టు కేసు పీపీబీ	1,670
డేటా కరెక్షన్‌	15,875
జీపీఏ	153
నిషేధిత జాబితా	7,153
ఇష్యూ ఆఫ్‌ పీపీబీ/నాలా	481
ఖాతా మెర్జింగ్‌	26
లాండ్‌ మేటర్‌ గ్రీవెన్స్‌	1,687
నాలా డబ్ల్యూఓ పీపీబీ	328
ఆర్గనైజేషన్‌ పీపీబీ	07
పెండింగ్‌ మ్యుటేషన్స్‌	3,438
సక్సేషన్‌	1,381
అర్బన్‌ ల్యాండ్‌	601
మొత్తం దరఖాస్తులు	36,463

ఆరుసార్లు తిరిగాను



సిద్దాపూర్‌ రెవెన్యూ సర్వే నం. 265/4లో వారసత్వంగా వచ్చిన 10 గుంటల భూమి ఉంది. పట్టాదారు పాసుపుస్తకం, పహాణీల్లోనూ నాపేరే ఉంది. పొజిషన్‌లో ఉన్నా ధరణి పోర్టల్‌లో నా పేరు లేదు. భూమిని నా పేరిట ఎక్కించాల్సిందిగా కోరుతూ ఏప్రిల్‌ 16న దరఖాస్తు చేశా. ఇప్పటికే ఆరు సార్లు కలెక్టరేట్‌ చుట్టు తిరిగాను. సమస్య పరిష్కారం కాలేదు.

– పాత్లవత్‌ తోత్య, కొత్తూరు

పేరు లేదంటున్నారు



చిన్న శంకర్‌పల్లి రెవెన్యూ సర్వే నం.93లో నా తండ్రి పేరున 12 గుంటల వారసత్వ భూమి ఉంది. ఈ భూమిని నాపేరున ఎక్కించాల్సిందిగా కోరుతూ మా నాన్న మరణ ధ్రువీకరణ పత్రం సమర్పించాను. దరఖాస్తు పెట్టి ఆరు నెలలైంది. ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. వృద్ధాప్యానికి తోడు అనారోగ్యంతో బాధ పడుతున్నా. అవసరానికి అమ్ముకుందామంటే.. అధికారులు ఆ భూమి మా నాన్న పేరున లేదంటున్నారు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– బాలకృష్ణారెడ్డి, చిన్నశంకరపల్లి

దరఖాస్తు చేసి రెండేళ్లైంది



తుమ్మలూరు సర్వే నంబర్‌ 51/ఉలో 14 గుంటల వారసత్వ భూమి ఉంది. ఇది వేరే వాళ్ల పేరున నమోదు చేశారు. దీన్ని తన పేరున మార్చాల్సిందిగా కోరుతూ 2022 డిసెంబర్‌ 21న ధరణి పోర్టల్‌లో దరఖాస్తు చేశా. మహేశ్వరం తహసీల్దార్‌ ఆఫీసు, కలెక్టరేట్‌ చుట్టూ తిరిగా. ఇప్పటికీ నా సమస్య పరిష్కారం కాలేదు.

– కుమ్మరి వెంకటయ్య, మహేశ్వరం

తిరిగి.. తిరిగి అలసిపోయా



రాందాస్‌పల్లి సర్వే నంబర్‌ 41లో 3.20 ఎకరాల పట్టా భూమి ఉంది. కారణం చూపకుండానే నిషేధిత జాబితాలో చేర్చారు. తొలగించాల్సిందిగా కోరుతూ ఏడాది క్రితమే దరఖాస్తు చేశా. తహసీల్దార్‌ ఆఫీసుకు వెళ్తే... ఆర్డీఓ ఆఫీసుకు వెళ్లమని, తీరా అక్కడికి వెళ్తే.. కలెక్టరేట్‌కు వెళ్లాల్సిందిగా సూచిస్తున్నారు. ఏడాది నుంచి ఇప్పటి వరకు 25 సార్లు ఆయా అధికారుల చుట్టూ తిరిగాను. అయినా సమస్య పరిష్కారం కాలేదు.

– పాతూరి ప్రకాష్‌, ఇబ్రహీంపట్నం

దేశంలోనే ఒకే ఒక్కడు.. మనోడు

- పీఎంజీ అవార్డుకు ఎంపికైన మీర్జాగూడ వాసి
- హెడ్‌ కానిస్టేబుల్‌ యాదయ్యను అభినందించిన ఉన్నతాధికారులు



యాదయ్య

చేవెళ్ల: దేశంలోని పోలీసుల ధైర్యసాహసాలకు అందించే అత్యున్నత ప్రెసిడెంట్స్‌ మెడల్‌ ఫర్‌ గ్యాలంటరీ(పీఎంజీ) అవార్డుకు తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపికైన ఒక్కేఒక్కరు హెడ్‌కానిస్టేబుల్‌ చదువు యాదయ్య. మండల పరిధిలోని మీర్జాగూడ గ్రామానికి చెందిన చదువు నర్సింలు, అనుసూజల కుమారుడు . ఈయన మీర్జాగూడ ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్య, ఆలూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో పదోతరగతి పూర్తి చేశారు. చేవెళ్ల ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో చదువుతున్న సమయంలో 2000లో కానిస్టేబుల్‌ ఉద్యోగం సాధించాడు.



హెడ్‌ కానిస్టేబుల్‌ను సన్మానిస్తున్న పోలీస్‌ ఉన్నతాధికారులు

వివిధ పీఎస్‌లలో పనిచేస్తూ ప్రస్తుతం మాదాపూర్‌ సీసీఎస్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఈయనకు భార్య మీన ఓ కుమారుడు, కూతురు సంతానం.

పోలీస్‌ ఉన్నతాధికారుల అభినందనలు

పీఎంజీ అవార్డు దేశంలో ఒక్కేఒక్కడికి అది మన రాష్ట్రానికి చెందిన యాదయ్య కావడంతో డీజీపీ జితేందర్‌, సీపీ అవినాష్‌ మహంతి, ఇతర పోలీసు అధికారులు ఆయన్ను బుధవారం ఘనంగా సన్మానించారు.



షాబాద్‌: తిర్మలాపూర్‌లో కృష్ణ,ఉమారాణి దంపతులకు నగదు అందజేస్తున్న శ్రీరాంరెడ్డి(ఫైల్‌)

మేము సైతం

స్వాతంత్య్ర దినోత్సవం.. భరత నేల గర్వించదగిన రోజు. ఈ రోజు మహనీయుల త్యాగాలను గుర్తు చేస్తుంది. ప్రజాస్వామ్యం, ఐక్యత వంటి రాజ్యాంగంలో పొందుపరిచిన ఆదర్శాల స్ఫూర్తితో ఈ రోజు జెండా వందనం నిర్వహించుకుంటాం. స్వతంత్ర భారతావనిలో సమాజ అభ్యున్నతికి కృషి చేస్తున్న పలు గ్రామాలు, వ్యక్తులపై ‘సాక్షి’ ప్రత్యేక కథనం.

పల్లె మెచ్చిన బ్రదర్స్‌



ఆనంద్‌, బాలీశ్వర్‌

కేశంపేట: మండల పరిధిలోని కొండారెడ్డిపల్లికి చెందిన పల్లె బ్రదర్స్‌ (పల్లె ఆనంద్‌కుమార్‌, పల్లె బాలీశ్వర్‌) తమ సొంత ఖర్చుతో గ్రామాభివృద్ధికి పాటుపడుతున్నారు. సుమారు రూ.80లక్షలతో గ్రామమంతా పేవర్‌ బ్రిక్స్‌, కర్బింగ్‌తో రోడ్లు వేశారు. దీంతో గ్రామం సర్వాంగ సుందరంగా మారింది. గ్రామంలోని ముగ్గురు నిరుపేదలకు ఇళ్లు కట్టించి ఇచ్చారు.




షాబాద్‌: హైతాబాద్‌లో ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎండీ చాంద్‌పాషా(ఫైల్‌)

మద్యం అమ్మకాలు నిషేధం

కేశంపేట: మండల పరిధిలోని బోదునంపల్లి గ్రామస్తులు స్వచ్ఛందంగా మద్యం అమ్మకుండా చర్యలు తీసుకున్నారు. గ్రామంలో సుమారు 2వేల జనాభా ఉండగా 964 మంది ఓటర్లున్నారు. ఇక్కడ అధిక శాతం వ్యవసాయాధారిత కుటుంబాలే. 13 ఏళ్ల క్రితం గ్రామస్తులంతా సమావేశమై గ్రామంలో మద్యం అమ్మొద్దని తీర్మాణించుకున్నారు. ఇదే కట్టుబాటు నేటికీ కొనసాగుతోంది.

ఆడబిడ్డకు జన్మనిస్తే ఆర్థికసాయం



శ్రీరాంరెడ్డి

షాబాద్‌: ఆడపిల్లలను భారంగా భావిస్తున్న తల్లిదండ్రులకు కనువిప్పు కలిగించేందుకు మండల పరిధిలోని తిర్మలాపూర్‌ గ్రామానికి చెందిన శ్రీరాంరెడ్డి తనవంతుగా పాటుపడుతున్నారు. గ్రామంలో ఆడబిడ్డకు జన్మనిచ్చిన దంపతులకు ఆయన రూ.5,211 ఆర్థికసాయం అందజేస్తున్నారు. రెండేళ్ల క్రితం ప్రారంభించిన ఈ కార్యక్రమంలో ఆయన ఇప్పటికే ఆడబిడ్డకు జన్మనిచ్చిన 25 జంటలకు ఆర్థికసాయం అందజేశారు.

‘కల్యాణ లక్ష్మి’ స్ఫూర్తిగా..



ఎండీ చాంద్‌పాషా

షాబాద్‌: మాజీ సీఎం కేసీఆర్‌ ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి పథకం స్ఫూర్తిగా మాజీ కో–ఆప్షన్‌ సభ్యుడు ఎండీ చాంద్‌పాషా పేదింటి ఆడబిడ్డల పెళ్లిల్లకు రూ.11వేల ఆర్థికసాయం అందజేస్తున్నాడు. ఐదేళ్లుగా హైతాబాద్‌ గ్రామంలో 45 మంది పేదింటి ఆడబిడ్డల వివాహాలకు సాయం అందజేశాడు.



కొండారెడ్డిపల్లి గ్రామంలో పల్లె బ్రదర్స్‌ వేసిన పేవర్‌ బ్రిక్స్‌ రోడ్డు

కొలువుల కొండ.. పటేల్‌ చెరువు తండా

మంచాల: అదో మారుమూల తండా.. ఉద్యోగాల కొండగా విరాజిల్లుతోంది. ఇక్కడి గిరిజనం ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రజలకు సేవలందిస్తూ.. తండాకు గొప్పపేరు తీసుకువస్తున్నారు. మండల పరిధిలోని పటేల్‌ చెరువు తండాలో 327 ఇళ్లుండగా 1,100 మంది జనాభా. ప్రభుత్వ ఉద్యోగంపై మక్కువతో పోటీపరీక్షల్లో నెగ్గుతూ కొలువులు సాధిస్తున్నారు. ఇప్పటికే 41 మంది ప్రభుత్వ ఉద్యోగులున్నారు. పోలీస్‌ డిపార్ట్‌మెంట్‌లో 25 మంది ఉద్యోగాలు సాధించగా ఐదుగురు ఐఏఎస్‌ స్థాయిలో మిగిలిన వారు కానిస్టేబుల్స్‌గా పనిచేస్తున్నారు. ఐదుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా, ముగ్గురు వైద్యులుగా, ముగ్గురు ఇంజినీర్లుగా, ఐదుగురు ఆర్టీసీలో డ్రైవర్‌, కండక్టర్లుగా పనిచేస్తున్నారు.

కండక్టర్‌ వేధిస్తున్నాడు

- పరుష పదజాలంతో దూషిస్తున్నాడు
- షాద్‌నగర్‌ డిపో ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన
- అతనిపై చర్యలు తీసుకోవాలని డిపో మేనేజర్‌కు ఫిర్యాదు

షాద్‌నగర్‌ రూరల్‌: స్కూల్‌కు వెళ్లేందుకు బస్సు ఎక్కిన విద్యార్థినుల పట్ల కండక్టర్‌ అమానుషంగా వ్యవహరిస్తున్నాడని, తీవ్ర పదజాలంతో దుర్భాషలాడుతున్నాడని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కేశంపేట మండలం సంగెం, వెంకన్నగూడ, కొండన్నగూడతో పాటు పలు తండాలకు చెందిన విద్యార్థులు నిత్యం ఆర్టీసీ బస్సులో వెళ్లర్ల, షాద్‌నగర్‌లోని స్కూళ్లు, కాలేజీలకు వెళ్తుంటారు. విద్యార్థుల సమయానికి అనుకూలంగా ఆర్టీసీ అధికారులు బస్సును నడుపుతున్నారు. అయితే, బస్సులో ప్రయాణించే తమ పట్ల నిత్యం విధుల్లో ఉండే కండక్టర్‌ రాములు దురుసుగా ప్రవర్తిస్తూ, దుర్భాషలతో వేధింపులకు గురిచేస్తున్నాడని పలువురు బాలికలు ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాగులో నుంచి ఆధార్‌ కార్డు తీసేందుకు కొద్ది ఆలస్యమైనా, స్నేహితులతో మాట్లాడినా దుర్భాషలాడుతూ బస్సును మధ్యలోనే నిలిపి, కిందకి దింపేస్తాడని తెలిపారు. పలు సందర్భాల్లో కాలి నడకన ఇళ్లకు చేరుకున్నామని వాపోయారు. ఇలా విసిగిపోయిన బాలికలు విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో బుధవారం బస్సు గ్రామానికి చేరుకునే లోపే సంగెం బస్టాండ్‌కు వచ్చారు. బస్సులో కండక్టర్‌ లేకపోవడంతో అంతా కలిసి షాద్‌నగర్‌ డిపో వద్దకు చేరుకుని గేటు ఎదుట ధర్నా చేపట్టారు. విద్యార్థినులపై వేధింపులకు పాల్పడుతున్న కండక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిపో అధికారులకు ఫిర్యాదు చేశారు.

విధుల నుంచి పక్కన పెట్టాం..

ఈ విషయంపై స్పందించిన డిపో మేనేజర్‌ ఉష మాట్లాడుతూ.. సదరు కండక్టర్‌ను విధుల నుంచి పక్కన పెట్టామని తెలిపారు. ప్రయాణికుల ఫిర్యాదు మేరకు అతనిపై విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు అశ్విని, కీర్తన, మౌనిక, కళ్యాణి, శిరీష, సంధ్య, నందిని, రాధిక, పూజ, మానస, హరిణి, బిందు, స్వప్న, విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు.



డిపో ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

బదిలీల్లో తప్పిదాలను సరిచేయండి

డీటీఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి

షాద్‌నగర్‌రూరల్‌: ఉపాధ్యాయ బదిలీల్లో నెలకొన్న తప్పిదాలను సరి చేయాలని డెమోక్రటిక్‌ టీచర్స్‌ ఫెడరేషన్‌(డీటీఎఫ్‌) జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. 13 ఏళ్ల తరువాత జరిగిన బదిలీల్లో అన్యాయం జరగడంతో ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారన్నారు. మహిళా ఉపాధ్యాయులను మారుమూల గ్రామాలకు బదిలీ చేయడంతో వారు పాఠశాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. బదిలీల్లో సీనియర్‌, జూనియర్‌ ప్రాతిపదికన ఇచ్చిన ఉత్తర్వులను సవరించాలని కోరారు.

వసతుల కల్పనకు చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్‌ శశాంక

- వసతిగృహాల నిర్వాహణపై శ్రద్ధ అవసరం
- ప్రత్యేక అధికారులు తరచూ తనిఖీలు చేపట్టాలి
- కలెక్టర్‌ శశాంక

సాక్షి, రంగారెడ్డి జిల్లా: వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ శశాంక ప్రత్యేక అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ.. ప్రతీ వారం ప్రత్యేకాధికారులు తమకు కేటాయించిన వసతిగృహాల్లో తనిఖీలు చేపట్టి తాగునీటి వసతి, విద్యార్థులకు అందజేస్తున్న ఆహారం, మరుగుదొడ్ల సరిగా ఉన్నాయా లేదా అని ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. కాచి చల్లార్చిన నీటినే విద్యార్థులకు అందజేయాలన్నారు. సీజనల్‌ వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వార్డెన్లతో టెలీ కాన్ఫరెన్స్‌

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా వసతి గృహాల్లోని విద్యార్థులకు హెల్త్‌క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కిటికీలు, తలుపులు, విద్యుత్‌ సరఫరా తదితర సమస్యలుంటే తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. సమస్యలుంటే పంచాయతీ కార్యదర్శి, లోకల్‌బాడీ వారి సహకారం తీసుకోవాలన్నారు. వార్డెన్లతో ప్రతీ వారం టెలీ కాన్ఫరెన్స్‌ నిర్వహించి సమస్యలపై ఆరా తీసి పరిష్కరించాలన్నారు. హాస్టల్‌ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా చూడాలని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్‌ ప్రతిమాసింగ్‌, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు రామారావు, రామేశ్వరి దేవి, నవీన్‌ కుమార్‌ రెడ్డి, సీపీఓ సౌమ్య, పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై గునుగల్ గేట్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. యాచారం నుంచి ఇబ్రహీంపట్నం వైపు బుధవారం మధ్యాహ్నం బైక్‌పై వెళ్తున్న శ్రీనుని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో తన పేరు శ్రీను అని చెప్పి కోమాలోకి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ దొంగ అరెస్టు

ఇబ్రహీంపట్నం రూరల్: బస్టాండ్ వద్ద ప్రయాణికుల జేబులో ఉన్న సెల్‌ఫోన్లను దొంగిలిస్తున్న మహిళపై కేసు నమోదు చేసిన సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. తుర్కయంజాల్ బస్టాండ్ వద్ద బస్సు ఎక్కే, దిగేవారిని గమనించి వారి జేబులోనుంచి సెల్‌ఫోన్లు దొంగిలిస్తున్న వందన అనే మహిళను పోలీసులు పట్టుకున్నారు. సెల్‌ఫోన్ దొంగిలించి దాని నుంచి ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా డబ్బులు కాజేస్తారు. వందన వద్ద సెల్‌ఫోన్‌తో పాటు రూ.70 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆమె చంకలో 8 నెలల బిడ్డతో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మారుద్దాం



పోస్టర్లతో అవగాహన కల్పిస్తున్న యాంటీ నార్కోటిక్ బ్యూరో ఎస్పీ సాయిచైతన్య

చేవెళ్ల: రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఎస్పీ, ఐపీఎస్ అధికారి సాయిచైతన్య అన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణపై చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కాలేజీలో బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్ వాడకం వల్ల ఎంతో మంది జీవితాలను నష్టపోతున్నారని తెలిపారు. మత్తు, మైకంలో నేరాలకు పాల్పడుతున్నారన్నారు. డ్రగ్స్ అమ్మినా, కొన్నా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నార్కోటిక్ డీఎస్పీ హరిచందర్‌రెడ్డి, సీఐ గోపి శ్రీనివాస్, చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్, రమేశ్‌నాయుడు, ఎస్‌ఐలు శ్రీకాంత్‌రెడ్డి, మెడికల్ కళాశాల డీన్ సత్యనారాయణ, సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ జోయారాణి, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు, ఏఓ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నాయనమ్మ హత్య కేసులో మనవడికి పదేళ్ల జైలు

కేశంపేట: నాయనమ్మను హత్య చేసిన ఘటనలో మనవడికి పదేళ్ల జైలు శిక్షతో పాటుగా రూ.పది వేల జరిమానా విధిస్తూ బుధవారం జిల్లా 9వ అడిషనల్ కోర్టు జడ్జి హరీశ తీర్పునిచ్చారు. కేశంపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాకునూర్ గ్రామంలో శేఖర్ మద్యం తాగేందుకు డబ్బుల కోసం నాయినమ్మ లక్ష్మమ్మ(90)తో 2019లో గొడవపడ్డాడు. మద్యం తాగేందుకు పింఛన్ డబ్బులు ఇవ్వలేదనే కారణంతో శేఖర్ నాయనమ్మను కర్రతో తలపైన కొట్టి చంపాడంటూ మరో మనవడు యాదగిరి పోలీసులకు అప్పట్లో ఫిర్యాదు చేశారు. దీనిపై సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ఎస్‌ఐ కోన వెంకటేశ్వర్లు సాక్ష్యాధారాలను సేకరించి కోర్టుకు సమర్పించారు. పరిశీలించిన జడ్జి హరీశ నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటుగా రూ.పదివేలు జరిమానాను విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసును న్యాయవాది రఘు వాదించినట్లు ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

హాజరుపై మేయర్ ఆరా

సాక్షి, సిటీబ్యూరో: ఇటీవల జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగులు సమయానికి హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి.. బుధవారం సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. మధ్యాహ్నం దిగువ అంతస్తులోని రెండుమూడు విభాగాల్లో సిబ్బంది హాజరును ఆమె అడిగి తెలుసుకున్నారు. సమయానికి వచ్చినట్లు అధికారులు ఆమెకు తెలిపారు.

పేదోడి గూడు.. సమస్యల గోడు

రాజీవ్ గృహకల్పకు అందని మిషన్ భగీరథ నీళ్లు

- ప్రారంభించి పదకొండేళ్లైనా జీపీకి అప్పగించని హెచ్‌ఎండీఏ
- నీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణకు పంచాయతీపై అదనపు భారం



చిలుకూరులోని రాజీవ్ గృహకల్ప సముదాయం

మొయినాబాద్: పేదోడి గూడులో సమస్యల గోడు వినిపిస్తుంది. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ నల్లా నీళ్లు ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం పథకం కింద నిర్మించిన రాజీవ్ గృహకల్ప ఇళ్లకు మాత్రం ఆ నీళ్లు అందడం లేదు. నీటి సమస్యతో పాటు డ్రైనేజీ, వీధిదీపాలు, పారిశుద్ధ్య సమస్యలు ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. గృహాలు ప్రారంభమై పదకొండేళ్లు దాటినా ఇప్పటికీ వాటిని హెచ్‌ఎండీఏ నుంచి గ్రామ పంచాయతీకి అప్పగించలేదు. అయినా ఇక్కడి సమస్యల పరిష్కారానికి మాత్రం గ్రామ పంచాయతీపై అదనపు భారం పడుతోంది.

బోర్ల ద్వారానే నీటి సరఫరా

తెలంగాణ రాష్ట్రం వచ్చాక ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికీ నల్లా నీళ్లు అందిస్తుంది. కానీ చిలుకూరులోని రాజీవ్‌గృహకల్ప సముదాయాలకు మాత్రం భగీరథ నీళ్లు అందడంలేదు. దీనికి ప్రధాన కారణం ఈ గృహాలు ఇప్పటి వరకు గ్రామ పంచాయతీలో నమోదు కాకపోవడమే. అప్పట్లో ఈ గృహాలను హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో నిర్మించారు. తరువాత హెచ్‌ఎండీఏ నుంచి గ్రామ పంచాయతీకి బదిలీ చేయాలి. కానీ ఇప్పటి వరకు గృహాలను గ్రామ పంచాయతీకి మార్చలేదు. దీంతో ఇక్కడ మిషన్ భగీరథ పైప్‌లైన్లు వేయలేదు. ప్రస్తుతం ఇక్కడ బోర్ల ద్వారానే నీటి సరఫరా చేస్తున్నారు.

గ్రామ పంచాయతీపైనే భారం

చిలుకూరు రాజీవ్ గృహకల్ప గృహాలు గ్రామ పంచాయతీలో నమోదై లేకున్నా ఇక్కడి సమస్యల పరిష్కార భారం మాత్రం గ్రామ పంచాయతీపైనే పడుతోంది. బోర్ల ద్వారా నీటి సరఫరాతోపాటు పారిశుద్ధ్య నిర్వహణ, వీధిదీపాల ఏర్పాటు వంటి పనులన్నీ గ్రామ పంచాయతీ ద్వారానే చేయిస్తున్నారు. ఇక్కడ నిర్మించిన సెప్టిక్ ట్యాంక్‌లు ప్రతి ఆరు నెలలకోసారి నిండుతుండడంతో వాటిని గ్రామ పంచాయతీ ద్వారానే ఖాళీ చేయిస్తున్నారు. ఈ ఖర్చులన్నీ గ్రామ పంచాయతీ భరించాల్సి వస్తోంది.

2013లో ప్రారంభం

మొయినాబాద్ మండలం చిలుకూరులో 2006లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేదలకు సొంతింటి కల నెరవేర్చడం కోసం జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం(జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యూవల్ మిషన్) పథకం కింద 992 రాజీవ్ గృహకల్ప ఇళ్లను మంజూరు చేశారు. అందుకోసం రూ.35 కోట్ల నిధులు కేటాయించారు. 2008లో పనులు ప్రారంభమై 2012లో పూర్తయ్యాయి. 2013 జనవరిలో అప్పటి రాష్ట్ర హోంమంత్రి సబితారెడ్డి గృహాలను ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు.

జీపీపై పెరిగిన భారం



చిలుకూరు రెవెన్యూలో నిర్మించిన రాజీవ్ గృహకల్ప గృహాలను హెచ్‌ఎండీఏ అధికారులు ఇప్పటి వరకు గ్రామ పంచాయతీకి అప్పగించలేదు. దీంతో అక్కడి నుంచి జీపీకి పన్నులు రావడం లేదు. కానీ అక్కడి సమస్యలన్నీ గ్రామ పంచాయతీ పరిష్కరించాల్సి వస్తుంది. ఈ భారమంతా గ్రామ పంచాయతీపై పడుతోంది. – వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శి, చిలుకూరు

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం



జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం గృహ సముదాయానికి మిషన్ భగీరథ వాటర్ కనెక్షన్ లేదనే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. దానిపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పూర్తి నివేదిక తయారు చేస్తున్నారు. త్వరలోనే గృహకల్పకు మిషన్ భగీరథ నీటి కనెక్షన్ ఇచ్చే అవకాశం ఉంది. – సంధ్య, ఎంపీడీఓ, మొయినాబాద్

సీఎంను కలిసిన మల్‌రెడ్డి బ్రదర్స్



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మల్‌రెడ్డి బ్రదర్స్

ఇబ్రహీంపట్నం: రాష్ట్రంలో పెట్టుబడులను ఆహ్వానించేందుకు విదేశాలకు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన ముగించుకొని బుధవారం హైదరాబాద్ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఏర్పాటు చేయబోయే కంపెనీల్లో స్థానిక యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

మహిళ ఆత్మహత్య

మల్కాజిగిరి : ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మౌలాలికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ముక్రం అలియాస్‌కు రెండేళ్ల క్రితం జీడిమెట్లకు చెందిన రేష్మాబేగంతో వివాహం జరిగింది. వారికి ఓ కుమారుడు. ఈనెల 13న రాత్రి భర్తతో గొడవపడి రేష్మాబేగం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అదనపు కట్నం కోసం భర్త వేధింపుల కారణంగా తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లి రజియాబేగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న స్త్రీ శిశుసంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ నిర్మలాక్రాంతి వెస్లీ

అమానుష ఘటనపై విచారణ

- గత నెల 6న మలక్‌పేట్‌లోని హాస్టల్‌లో బాలికపై లైంగిక దాడి
- కేసు వివరాలు సేకరించిన స్త్రీశిశు సంక్షేమ శాఖ డైరెక్టర్

బొంరాస్‌పేట: ఏడేళ్ల అంధ బాలికపై లైంగిక దాడి జరిగిన ఘటనపై బుధవారం అధికారులు విచారణ నిర్వహించారు. బాధితుల వివరాల మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన దంపతుల కూతురు ఏడాది వయసులోనే చూపును కోల్పోయింది. దీంతో దివ్యాంగుల సంక్షేమ సంస్థ కమిట్‌మెంట్స్ సిబ్బంది ఏడాది క్రితం హైదరాబాద్ మలక్‌పేటలోని అంధత్వ వసతి గృహంలో చేర్పించారు. అక్కడ పారిశుద్ధ్య పనులు చేస్తున్న నరేశ్ గత నెల 6న బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. విషయం పొక్కకుండా వసతిగృహం వార్డెన్ పద్మ జాగ్రత్తలు తీసుకున్నారు. దీనిపై బాధిత తల్లి ఫిర్యాదు చేసింది. ఘటనపై వెల్లువెత్తిన నిరసనలతో కేసును స్త్రీ శిశు సంక్షేమాధికారికి అప్పగించారు.

రాష్ట్ర స్థాయి అధికారుల విచారణ

బొంరాస్‌పేటలో ఉన్న బాలికను విచారించేందుకు స్త్రీ శిశుసంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ నిర్మలాక్రాంతి వెస్లీ వచ్చారు. బాలికతో పాటు తల్లిదండ్రులతో మాట్లాడి సంఘటన వివరాలు తెలుసుకుని విచారం వ్యక్తంచేశారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని బాధిత తల్లిదండ్రులు అధికారులను కోరారు. బాలిక ఆరోగ్య పరిస్థితులపై తమ శాఖ నుంచి రూ.25 వేల చెక్కును అందజేశారు. వీరితో పాటు స్త్రీ శిశుసంక్షేమ శాఖ హైదరాబాద్ డీడబ్ల్యూఓ అకేశ్వర్‌రావు, హైదరాబాద్ డీసీపీఓ శ్రీనివాస్, స్వాతి, జీవిత, వికారాబాద్ డీడబ్ల్యూఓ, కొడంగల్ సీడీపీఓ కృష్ణవేణి, సూపర్‌వైజర్ మంజుల, చైల్డ్‌లైన్ జిల్లా అధికారి శ్రీకాంత్ ఉన్నారు.

హిందుత్వంపై కమ్యూనిస్టుల కుట్ర

- కులాల వారీగా విభజిస్తున్న రాజకీయ నాయకులు
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విశ్వ హిందూ పరిషత్ క్షేత్ర ప్రముఖ్ రమేశ్



తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: కమ్యూనిస్టులు చైనా, రష్యా దేశాలకు తొత్తులుగా ఉంటూ భారతదేశంలో హిందూ ధర్మాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విశ్వహిందూ పరిషత్ క్షేత్ర ప్రముఖ్ బండారి రమేశ్ ఆరోపించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హింసాకాండను నిరసిస్తూ హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం వీహెచ్‌పీ, బీజేపీ, హిందూ వాహిని, భజరంగ్‌దళ్, ఏబీవీపీ, హిందూ సంఘాల నాయకులు ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ మెయిన్ రోడ్డు మీదుగా తహసీల్దారు కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా బంగ్లాదేశ్‌లో ఉంటున్న హిందువులకు రక్షణ కల్పించాలని కోరుతూ తహసీల్దారు కార్యాలయంలో అధికారులకు నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం బండారి రమేశ్ మాట్లాడుతూ.. రాజకీయ నాయకులు ఓటు కోసం హిందువులను కులాల వారీగా విభజించి హిందూ ధర్మాన్ని మతాన్ని నాశనం చేస్తున్నారని ఆరోపించారు. భారతదేశంలో కమ్యూనిస్టులు హిందూ వాదాన్ని అణిచివేసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. బంగ్లాదేశ్, పాకిస్తాన్ దేశాలకు స్వేచ్ఛను ప్రసాదించిన హిందువులపై కత్తి కట్టిన ఇస్లామిక్ తీవ్రవాద చర్యలను ఖండిస్తున్నామన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ఇప్పటికైనా హిందువులంతా ఐకమత్యంగా ఇలాంటి దాడులను తిప్పికొడదామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్, రాచయ్య, బి.రమేశ్, మురళి, యువసత్తా లక్ష్మణ్‌కుమార్, రవిశర్మ, కరుణాకర్, శివ, వంశీ, హరిభూషణ్, అశోక్, రుషికేశ్, సాయి, శ్రీనివాసచారి, మహేశ్, మనోహర్, మధు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోబోస్ప్రేయర్‌తో మందు పిచికారీ

షాబాద్: పత్తి పంటను మండలంలోని అన్ని గ్రామాల్లో ఏటా అధికంగా రైతులు సాగు చేస్తున్నారు. గతేడాది పత్తి పండించిన రైతులు మంచి లాభాలు గడించారు. దీంతో ఎక్కువ మంది దీనిని సాగు చేయడంతో కూలీల కొరత ఏర్పడింది. మరియాపురం గ్రామానికి చెందిన విజయ్‌భాస్కర్‌రెడ్డి పత్తి పంటకు చీడపీడల నివారణకు రోబోస్ప్రేయర్‌తో రసాయనాలు పిచికారీ చేస్తున్నారు. ఈ యంత్రం ద్వారా 40 నిమిషాలలో 4 ఎకరాలకు మందు పిచికారీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రోజుకు 30 నుంచి 40 ఎకరాలలో పత్తి పంటకు మందు పిచికారీ చేస్తున్నామన్నారు. రోబోస్ప్రేయర్ ట్యాంక్‌లో 600 వందల లీటర్ల నీటితో పాటు పురుగు మందులు కలిపి పంటకు కొడుతున్నట్లు రైతులు తెలిపారు.



ట్రాక్టర్‌తో పత్తి పంటకు మందు పిచికారీ చేస్తున్న రైతు

రిటైర్డ్ కల్నల్‌కు టోకరా

- నకిలీ రిజిస్ట్రేషన్‌తో ఖాళీ స్థలం కబ్జాకు యత్నం
- నిందితుల అరెస్ట్

కంటోన్మెంట్: ప్లాటు ఖాళీగా ఉంది, 87 ఏళ్ల వయసున్న యజమాని అందుబాటులో లేడు.. పైగా సదరు ప్లాటు 1982లో రిజిస్ట్రేషన్ అయి ఉంది. అప్పటి డాక్యుమెంట్‌లలో యజమాని ఫొటో, ఫింగర్ ప్రింట్స్ ఉండవు. ఇదే అదునుగా భావించిన ఓ ముఠా ప్లాటును సొంతం చేసుకునేందుకు పక్కాగా పథకం వేసింది. యజమాని వయసులో ఉన్న ఓ నకిలీ వ్యక్తిని గుర్తించారు. తమకు తెలిసిన మరో విక్రేతకే అమ్ముతున్నట్లుగా రిజిస్ట్రేషన్ చేయించారు. ఇందుకు సంబంధించి ఇద్దరు నకిలీ సాక్షులను కూడా రంగంలోకి దింపారు. వీరి పన్నాగం ఫలించి, రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా సాఫీగా జరిగిపోయింది. అయితే అసలు యజమాని రంగంలోకి దిగడంతో వారి మోసం బయటపడింది. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన పోలీసులు ఫేక్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయించి, నిందితులను రిమాండ్‌కు తరలించారు. బుధవారం నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మి కేసు వివరాలు వెల్లడించారు.

◆ ఆర్మీ రిటైర్డ్ కల్నల్ కృష్ణారావుకు కార్ఖానా పోలీస్ స్టేషన్ పరిధిలోని గన్‌రాక్ ఎన్‌క్లేవ్‌లో 450 గజాల స్థలం ఉంది. కొన్నేళ్లుగా స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో నగరంలోని ఈడీ బజార్, బోయిన్‌పల్లికి చెందిన ఇద్దరు రియల్ ఎస్టేట్ బ్రోకర్లు ఉబేయిద్ బిన్ మహ్మద్, షేక్ రాఫ్ పాషా సదరు ప్లాటుపై కన్నేశారు. బాన్సువాడకు చెందిన 64 ఏళ్ల సాయినాథ్‌ను కృష్ణారావుగా మార్చేశారు. ఈ మేరకు అతని ఆధార్ కార్డులోనూ మార్పులు చేశారు. నిజామాబాద్‌కు చెందిన మహ్మద్ అబిద్‌కు ప్లాటు విక్రయించేలా ఏర్పాటు చేశారు. ఇందుకు రసూల్‌పురాకు చెందిన షేక్ అమీద్, బాన్సువాడకు చెందిన బానోత్ భీమ్ సింగ్‌లను సాక్షులుగా చేర్చి గత మే నెలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగించేశారు.

అసలు యజమాని ఎంట్రీతో..

చెన్నైలో నివాసముంటున్న రిటైర్డ్ కల్నల్ కృష్ణారావు ఇటీవల నగరానికి వచ్చాడు. స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి, తన ప్లాటుకు సంబంధించిన వివరాలు సేకరించగా మరొకరి పేరిట రిజిస్ట్రేషన్ అయినట్లు గుర్తించాడు. దీంతో అతను కార్ఖానా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నకిలీ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయించి, నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఇటీవలి కాలంలో భూకబ్జాలు పెరిగిపోయాయని, కొందరు వ్యక్తులు ఖాళీ స్థలం కనిపిస్తే వాటిని కబ్జా చేసి విక్రయాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సీనియర్ సిటిజెన్స్ అధిక సంఖ్యలో ఉండే నార్త్‌జోన్ పరిధిలో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో నార్త్‌జోన్ అడిషనల్ డీసీపీ పీ.అశోక్, తిరుమలగిరి ఏసీపీ రమేష్, కార్ఖానా ఇన్స్పెక్టర్ రామకృష్ణ ,ఎస్‌ఐ రవికుమార్ పాల్గొన్నారు.